# 30. ఇస్లామీయ జీవనశైలి

**ఓ ఆదం సంతతివారలారా! మీరు మస్జిదుకు హాజరైన ప్రతిసారీ వస్త్రాలంకరణ పట్ల శ్రద్ధ వహించండి. తినండి, త్రాగండి. కాని మితిమీరకండి. మితిమీరిపోయే వారిని ఆయన (అల్లాహ్) ఇష్టపడదు.**

***(అల్ ఆరాఫ్ 7 : 31)***

**ప్రియసోదరసోదరీమణులారా..!**

ఇస్లాంకు పూర్వం అరబ్ దేశంలో అనేక అనాచారాలు, దురాచారాలు, మూఢ నమ్మకాలు చెలామణిలో ఉండేవి. వాటితో పాటు వస్త్రధారణ సంబంధించిన దురాచారాలు కూడా ఉండేవి. చాలామంది అరబ్బులు హజ్‌యాత్ర చేయటానికి కాబాను సందర్శించినపుడు నగ్నంగా ప్రదక్షిణ చేసేవారు. పుట్టినప్పుడు ఎలాంటి వస్త్రాలతో పుట్టము, ఇక దైనందన జీవితంలో ధరించే వస్త్రాలు మసిబారి, మురికగాఉంటాయి. అలాంటి స్థితిలో ప్రదక్షిణ చేయటం కన్నా నగ్నంగా, ఎలాంటి వస్త్రాలు లేకుండా ప్రదక్షిణ చేయటం శ్రేష్ఠం అనేది వారి అభిప్రాయం. ఈ దుష్టపోకడను ఖండిస్తూ అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు:

**ఓ ఆదం సంతతివారలారా! మీరు మస్జిదుకు హాజరైన ప్రతిసారీ వస్త్రాలంకరణ పట్ల శ్రద్ధ వహించండి. తినండి, త్రాగండి. కాని మితిమీరకండి. మితిమీరిపోయే వారిని ఆయన (అల్లాహ్) ఇష్టపడదు.**

***(అల్ ఆరాఫ్ 7:31)***

**దైవప్రవక్త(స) ఇలా సెలవిచ్చారు: ఎలాంటి పరిస్థితుల్లోను నగ్నంగా ఉండకండి. నిస్సందేహంగా మీతో ఎల్లప్పుడూ మీకు కానరాని జీవులు ఉంటారు. వారే దైవదూతలు. కాలకృత్యాలు తీర్చుకునేటపుడు, భార్యతో సంభోగించేటపుడు తప్ప వారు మిమ్మల్ని విడిపోరు. కాబట్టి మీరు వారి పట్ల లజ్జను పాటించండి. నగ్నంగా ఉండకండి. (సునన్ తిర్మిజీ)**

teluguislam.net



చొక్కా, పైజామా, ప్యాంట్, టోపి పురుషులకు తగిన దుస్తులు. చొక్కా క్రింద ధరించే వస్త్రమైనా చీలమండకు పైకి ఉండాలి. చీలమండలకు క్రింద ధరించటం గర్వానికి అహంకారానికి చిహ్నం. ఏ వ్యక్తి హృదయంలో రవ్వంత గర్వమున్నా ఆ వ్యక్తి స్వర్గసువాసనను కూడా పొందలేడు. పురుషులు బంగారం వస్తువులు, పట్టు వస్త్రాలు ధరించటం నిషిద్ధం. స్త్రీలు పూర్తిగా పరదాలో ఉండాలి. శరీరపు ఒక్క భాగం కూడా అగుపించకూడదు. తలవెంట్రుకల నుండి పాదాల వరకు స్త్రీపరదాలో ఉండాలి. శరీరం అగుపించే విధంగా పల్చని వస్త్రాలు ధరించే స్త్రీ ప్రళయ దినాన దిగంబరంగా లేపబడుతుంది. అలాంటి స్త్రీలు నరకంలో భగభగమండే అగ్నికి ఆహుతి అవుతారు.

**మహాశయులారా..!**

**పురుషుల అందం, అలంకరణలో గడ్డం పెంచటం, మీసాలు కత్తిరించటం కూడా భాగమే, గడ్డం పెంచటం ప్రవక్తలందరి సాంప్రదాయం. దైవ ప్రవక్త (స) గడ్డం చాలా దట్టంగా ఉండేది. (సహీహ్ ముస్లిం)**

మరో సందర్భంలో దైవప్రవక్త (స) ఇలా సెలవిచ్చారు: నేను నా గడ్డాన్ని పెంచాలని, నా మీసాలను కత్తిరించాలని నా ప్రభువు నన్ను ఆజ్ఞాపించాడు. మరో హదీసులో ఇలా ప్రవచించారు: మీసాలను కత్తిరించండి, గడ్డాన్ని పెంచండి, యూదులను అనుసరించకండి. *(షర్హు మానీల్ ఆసార్ 2/333)*

మీసాలు కత్తిరించటం, గడ్డం పెంచటం దైవ ప్రవక్త (స) సంప్రదాయం, ఇస్లామీయ చిహ్నమని, పురుషాలంకారమని మనకు పై హదీసువెలుగులో బోధపడుతుంది. షేవింగ్ చేసేవాళ్ళు, గడ్డాన్ని కత్తిరించేవాళ్ళు దైవప్రవక్త (స) సున్నత్‌కు వ్యతిరేకంగా చేస్తున్నారు. వారు కాస్త, ఆలోచించాలి ముస్లింలమని చెప్పుకుంటూ దైవప్రవక్త (స) ప్రభోధనలకు విరుద్ధంగా ఆచరిస్తే సాఫల్యం ఎలా కలుగుతుంది? పురుషుని హుందాతనానికి చిహ్నమైన గడ్డాన్ని తీసేసి స్త్రీల మాదిరిగా ముఖాలు సరిచేసుకోవటం ఎంతటి నికృష్ట చర్య? అలాంటి వారిపై అల్లాహ్ శాపం కురుస్తుంది.

తలవెంట్రుక అందానికి పురుషులు గోరింటాకు తైలం వాడుక సరైనదే. లూత్ జాతి వారి గురించి ఖుర్‌ఆన్‌లో అల్లాహ్ ఇలా ప్రస్తావించాడు:

**మేము లూతు (అలైహిస్సలాం)కు నిర్ణయం గైకొనే శక్తినీ, జ్ఞానాన్నీ ప్రసాదిం చాము. నీతిమాలిన పనులకులోనై ఉన్న జనవాసం బారి**

**నుంచి అతనికి విముక్తిని కల్పించాము. ఆ జాతి వారు పరమ నీచులు, అవిధేయులు.** ***(అల్ అంబియా 21 : 74)***

లూత్ జాతి ప్రజల్లో 18 చెడుచేష్టలు ఉండేవి. బానిసల పందెం, పావురాల పందెం, గడ్డం తీయటం వంటివి అల్లాహ్ శిక్షకు గురైన వారి అలవాట్లలో ఒక చెడు అలవాటు గడ్డం పూర్తిగా తీసేయటం కాబట్టి షేవింగ్ చేయటాన్ని విడనాడాలి. గడ్డాన్ని పెంచాలి.

ఇవిగాక తలవెంట్రుకలు దువ్వుకోవటం, నూనె రాసుకోవటం, సుర్మా పెట్టుకోవటం, గోళ్ళు కత్తిరించడం, చంకలోని వెంట్రుకలు, నాభి క్రింది వెంట్రుకలు తొలగించుకోవటం లాంటివి స్త్రీలు, పురుషులు చేయొచ్చు. స్త్రీలు గోరింటాకు వాడుకోవచ్చు ఇవన్నీ కూడా ఇస్లామీయ వ్యక్తిత్వం క్రిందకు వస్తాయి.

**ప్రియసోదరులారా..!**

ఇస్లామీయ బాహ్య స్వరూపం తరువాత ఇక అంతర్గత స్వరూపం, శీలం నడవడిక, క్రమశిక్షణ గురించి తెలుసుకుందాం. అసూయ, ఈర్ష ద్వేషం, అబద్ధాలు, అపనిందలు, పరోక్ష నిందలు, పాటలు, సంగీతం వినటం, ఇత్యాది అంతర్ రుగ్మతలకు దూరంగా మనకు ఆదర్శప్రాయమే. ఆ విధంగా మనము కూడా ప్రవర్తించాలి. పండితుడైనా, పామరుడైనా అన్ని విషయాల్లోనూ, వ్యవహారాల్లోనూ ఇస్లామీయ ఆదేశాలను తు.చ. తప్పకుండా పాటించాలి. నమాజ్, ఉపవాసాలుపాటిస్తూ, జకాత్, హజ్ పాటిస్తూ ఇతర మానసిక రుగ్మతలైన అబద్ధాలు, అసూయ, మోసం వంచనకు పాల్పడితే అతని ఆరాధనల్లో ప్రభావమూ, ప్రయోజనము ఉండదు. ఉపవాసం విషయంలో దైవప్రవక్త (స) ఇలా ప్రవచించారు: ఎవరయితే అబద్ధాలాడడం మానరో, అధర్మ కార్యాలు మానరో అలాంటి వారు అన్నపానీయాలను మానుకోవలసిన అవసరం అల్లాహ్‌కు లేదు (సహీహ్ బుఖారీ).

సత్యవంతులు, ఏకదైవారాధకులైన వారి ద్వారా ఇలాంటి పాపకార్యాలు దొర్లటం చాలా చెడ్డచేష్ట. అందుకే అలాంటివాటిని త్యజించి సత్కార్యాలు చేస్తూనే ఉండాలి. ఇందులో చాడీలు చెప్పటం ఘోరమైన పాపం. కాని ఇందులో అందరూ మునిగి ఉన్నారు. ఖుర్‌ఆన్ దీనిని తీవ్రంగా ఖండిస్తూ ఇలా ప్రబోధించింది:

**మీలో ఎవరూ ఇంకొకరి గురించి వీపు వెనుక చెడుగా చాడీలు చెప్పు**

teluguislam.net



**కోకూడదు. ఏమిటి మీలో ఎవరయినా చచ్చిపోయిన మీ సోదరుని మాంసం తినటానికి ఇష్టపడతారా? చూడండి, మీరు స్వయంగా దీన్ని ఏవగించు కుంటున్నారు? అల్లాహ్‌కు భయపడుతూ ఉండండి. నిశ్చయంగా అల్లాహ్ పశ్చాత్తాపాన్ని స్వీకరించేవాడు, కరుణించేవాడూను.**

***(అల్ హుజురాత్ 49 : 12)***

చాడీలు చెప్పటం మృతసోదరుని మాంసం తినటంతో సమానమని ఖుర్‌ఆన్ వివరిస్తుంది. దైవ ప్రవక్త (స) మేరాజ్ (ఆకాశ) ప్రయాణంలో చూసిన ఒక వింత సంఘటనను ఇలా వివరించారు: నేను నా సంఘంలోని ఒక సమూహం ను చూశాను వారి గొళ్ళు రాగి గోళ్ళు. గోళ్ళతో వారు తమ ముఖాలను, గుండెలను రక్కుకుంటున్నారు. వారు ఎవరని నేను జిబ్రయీల్ దూతను ప్రశ్నించాను. "వాళ్ళంతా ప్రజల మాంసం తినేవారు. చాడీలు చెబుతూ ప్రజల గౌరవ మర్యాదలను కించపరిచేవారు" ఆయన జవాబిచ్చారు.

ఒకరి విషయాలు ఒకరికి చెప్పుతూ వారి మధ్య విభేదాలు సృష్టిస్తూ ఉండే వారి గురించి దైవప్రవక్త(స) ఇలా అన్నారు:

**"చాడీలు చెప్పి చిచ్చుపెట్టేవాడు స్వర్గంలో ప్రవేశించడు"**

**(సునన్ అబూదావూద్)**

అల్లాహ్ ఇలా సెలవిస్తున్నాడు:

**"నువ్వు అదే పనిగా ప్రమాణాలు చేసే తుచ్ఛుని మాట వినకు. వాడు (ఎంత సేపటికీ) చులకనగా మాట్లాడతాడు, చాడీలు చెబుతాడు."**

***(అల్ ఖలమ్ 68 :10,11)***

మరోచోట (మునాఫిఖ్) కపట విశ్వాసుల గురించి ఇలా తెలుపటం జరిగింది:

**విశ్వాసులను కలుసుకున్నప్పుడు వారు,"మేమూ విశ్వసించిన వారమే" అని అంటారు. కాని తమ షైతానుల (అంటే తమ పెద్దల లేక సర్దారుల) వద్దకు పోయినప్పుడు, "మేము మీతోనే ఉన్నామండీ. కాకపోతే వాళ్ళతో పరిహాస మాడుతున్నామంతే" అని పలుకుతారు. *(అల్ బఖర 2:14)***

దైవప్రవక్త (స) ఇలా ప్రవచించారు:

**అతి చెడ్డ వ్యక్తులైన రెండు నాలుకలవారిని మీరు చూస్తారు. వారు ఒక మొహంతో కొందరి దగ్గరికి వెళ్తారు మరో మొహంతో మరికొందరి**

దగ్గరికి వెళ్తారు. (సహీహ్ బుఖారీ)

మరో సందర్భంలో దైవప్రవక్త (స) ఇలా అన్నారు: రెండు నాలుకల వ్యక్తి ప్రళయదినాన రెండు అగ్ని నాలుకల ముఖంతో వస్తాడు (సునన్ అబూదావూద్).

**ప్రియసోదరులారా..!**

మనిషి వ్యక్తిత్వానికి నడవడికకు మచ్చగా మార్చే చెడు కార్యాలు, పాపకార్యాలు చాలా ఉన్నాయి. వాటిన్నిటి నుండి బహుదూరంగా ఉండటం తప్పనిసరి. ఇతరులను అల్పులుగా, చులకనగా చూస్తూ తమను తాము గొప్పవారుగా భావించుకునే వారు కూడా నరకంలోకి పోతారు. తాము చేసేది సరైనది, ఇతరులు చేసేది తప్పు అని భావించేవారు లేకపోలేదు. ఇలాంటి వారు చాలా నీచులు.

హజ్రత్ జాబిర్ బిన్ సలీం (రజి) ఇలా తెలిపారు: 'నాకు ఏదన్నా ఉపదేశించండి' అని నేను దైవప్రవక్త (స)కు విన్నవించుకున్నప్పుడు, దైవప్రవక్త (స) ఇలా ప్రబోధించారు:

**"ఎవరినీ దూషించకు".**

**ఆ తరువాత నేను ఏ స్వేచ్ఛాపరుణ్ణి, బానిసను, ఒంటెను, మేకను దూషించలేదు." సత్కార్యాల్లోని ఏ పనిని తక్కువగా అంచనా వేయకు. చివరకు చిరుమందహాసంతో నీ సోదరుణ్ణి పలకరించు. పిక్కల వరకూ నీ ఇజారు (లేక లుంగీ) ఉండేలా చూసుకో. లేదా చీలమండల వరకు మాత్రం నీ వస్త్రం ఉండాలి. చీలమండల క్రిందికి వస్త్రం వ్రేలాడకుండా జాగ్రత్త పడు. ఎందుకంటే ఇది అహంకారానికి నిదర్శనం. నిశ్చయంగా గర్వపడే వారిని అల్లాహ్ ఇష్టపడడు. ఒకవేళ నిన్నెవరైనా రెచ్చగొట్టిన, దూషించినా నీ వద్ద గల జ్ఞానంతో వారినీ రెచ్చగొట్టకు, దూషించకు. ఎందుకంటే అతని పైత్యం అతన్నే చుట్టుకుంటుంది. (సునన్ అబూదావూద్)**

**మహాశయులారా..!**

ఇస్లామీయ నడవడిక, సత్ప్రవర్తన అమూల్యమైన సంపద. ఇహపరలోకాల్లో విజయం, సాఫల్యం వీటి ద్వారానే సాధ్యం అల్లాహ్ మనందరికి ఇస్లాం ఆదేశాల ప్రకారం జీవితం గడిపే భాగ్యాన్ని ప్రసాదించుగాక ఆమీన్..!